# సింగిల్ పేజి కథలు

# అదీ సంగతి!

ఉదయం ఆరు గంటల పది నిమిషాలు. చెన్నై సెంట్రల్ స్టేషన్ రద్దీగా ఉంది. పదవ నెంబరు ప్లాట్‌ఫాంపై ఇంకో పావుగంటలో బయలుదేరడానికి సిద్ధంగా ఉంది తిరుపతి వెళ్లే సప్తగిరి ఎక్స్‌ప్రెస్. వెనుక నేను వస్తున్నానా లేనా అని మాటిమాటికీ తిరిగి చూస్తూ ముందుకు వెళ్తున్నారు మా వారు. జనం మధ్యలో ఇరుక్కుపోవడం చేత వెనుకబడిపోతూ ఉన్నాను నేను.

"తొందరగా రా, భానూ!" అని భోగీలోకి ఎక్కి చేతిలోని సూట్‌కేసును కిటికీ వార సీటుపై పెట్టారాయన. నేనూ నా చేతిలోని పెద్ద ప్లాస్టిక్ బుట్టను సీటు క్రింద పెట్టి కిటికీ వారగా కూర్చున్నాను. ఆయన నా పక్కనే కూర్చున్నారు. మా ఎదురు సీటులో కిటికీ వారగా ఒకావిడా, పక్కన ఆవిడ భర్త కాబోలు, ఆయనకు పక్కన ఇద్దరు మగపిల్లలూ, ఒక అమ్మాయీ కూర్చుని ఉన్నారు. ఆయనకు నలభై అయిదేళ్లా, ఆవిడకు నలభై ఉండవచ్చు. పిల్లలు మాత్రం బాగా చిన్న పిల్లలు. పెద్ద అబ్బాయి వయస్సే ఎనిమిదేళ్లు మించకపోవచ్చు. ఆ దంపతుల వయస్సుకు, పిల్లల వయస్సుకు లింక్ కుదరక తికమకపడ్డాను.

నన్ను చూచి పలకరింపుగా నవ్విందావిడ. నేనూ నవ్వాను.

"ఎందాకా వెళ్తున్నారు?" అడిగాను.

"పుత్తూరు వెళ్తున్నామండీ. మా అత్తగారి ఊరు"


ఆ తరువాత తమ కుటుంబ విషయాలూ, వాళ్లాయన పనిచేస్తున్న కంపెనీ గురించీ, తమ బంధుమిత్రుల గురించే నానా విషయాలూ చెప్పడం ప్రారంభించింది. స్వతహాగా నాకు ఎక్కువగా మాట్లాడటం అలవాటు లేదు.

ఆవిడ బారి నుండి తప్పించుకోవడానికి ప్లాస్టిక్ బుట్టలో నుండి ఒక పుస్తకం తీసి చదువుకుంటూ కూర్చున్నాను. అది చూశాక ఆవిడా మాటలు తగ్గించింది. ఆ పిల్లలు మాత్రం వాళ్ల తల్లితండ్రులను ఏదో ఒక సందేహం అడుగుతూ, రైల్లో అమ్మకానికి వచ్చిన ప్రతీదాన్నీ కొనిపెట్టమని గొడవ పెడుతున్నారు. వాళ్ల నాన్న కసరుకుంటూనే ఉన్నాడు. ఆవిడ పెంపకం వల్లే ఆ పిల్లలు అలా తయారయ్యారని సూటిపోటి మాటలంటూ ఉన్నాడు. ఆవిడ మా ముందు అలా అవమానం భరించలేక, పాపం ఏడవలేక నవ్వినట్టు నన్ను చూసినప్పుడల్లా బలవంతంగా చిరునవ్వు తెచ్చిపెట్టుకుంటూ ఉంది.

నేను ఆవిడను ఇబ్బంది పెట్టలేక అదేదీ గమనించనట్టూ పుస్తక పఠనంలోనే పూర్తిగా మునిగిపోయినట్టూ పుస్తకం తిరగేయసాగాను.

అంతలో చిన్నపిల్లలిద్దరూ దేనికో కీచులాడుకోసాగారు. వాళ్ల నాన్నకు కోపం వచ్చి వాళ్లను తలా ఒకటి తగిలించాడు. దాంతో వాళ్లు ఏడుపు మొదలుపెట్టారు. ఆవిడ పరిస్థితి సంకటంలో పడింది. వాళ్లను యెలాగో సమాధానపరచింది.

పిల్లలన్నాక అల్లరి చేయకుండా ఉండరు కదా! వాళ్లనూ, భార్యనూ ఆ పెద్దమనిషి అంతగా కోపగించుకోవలసిన అవసరం ఉన్నట్టు కనిపించలేదు నాకు. మనిషికి



సహనం అన్నది అణుమాత్రమైనా ఉన్నట్టు లేదు.

మా వారు ఇదంతా మౌనంగా చూస్తూ కూర్చున్నారు. "బోర్ కొడుతోంది భానూ! నాకూ ఏదైనా పుస్తకముంటే ఇవ్వు" అన్నారు.

"ఈ పుస్తకమే చదవండి. మరీ చిన్న వయస్సులో కాకుండా కాస్త ఆలస్యంగా పిల్లలు పుడితే వాళ్లను ఎంత ఓపిగ్గా, చక్కగా పెంచవచ్చో కుటుంబాన్ని ఎంత చక్కగా ఉంచుకోవచ్చో ఈ రచయిత ఎంత చక్కగా రాశాడో! పిల్లలను ఒక క్రమశిక్షణతో పెంచడం పూర్తిగా తల్లి బాధ్యత మాత్రమే కాదు, అసలు తండ్రి బాధ్యతే ఎక్కువ అని తను మగవాడై ఉండీ ఎంత నిర్మొహమాటంగా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడో చూడండి. ఎంత అనుభవముంటే ఇలా రాయగలరు! మీరూ చదవండి. భవిష్యత్తులో మనకు పనికి వస్తుంది" అని నేను చదువుతున్న పుస్తకాన్ని మా వారి చేతికి ఇచ్చాను.

ఆ ఎదుటి మనిషికి మహా కోపం వచ్చినట్టు మొహం చూస్తేనే తెలుస్తూ ఉంది. నన్ను ఒకసారి ఉరిమి చూశాడు.

నేరకపోయి అలా మాట్లాడాను అనిపించింది. వాళ్లెవరో, మేమెవరమో! అనవసరంగా విరోధం తెచ్చుకోవడం మంచిది కాదు కదా! చప్పున తలదించుకుని వేరే పుస్తకం తీసి చదువుతున్నట్టు నటించసాగాను.

అరగంట గడిచింది. ఎదురు సీట్లో వాళ్లు వాళ్ల సామానులూ అవీ తీసి దిగడానికి తయారుగా వాకిలి దగ్గరగా పెడుతున్నారు. పుత్తూరు స్టేషన్‌లో రైలు ఆగింది.

ఆ ఎదురు సీటు ఆయన మాకు దగ్గరా వచ్చాడు.

"అనుభవం లేనప్పుడు మనకు తెలియని వాటిని గురించి ఏదేదో రాసెయవచ్చు. అది గొప్ప కాదు. అసలు అలా రాయడం ఇతరులను తప్పుదారి పట్టించినట్టు కూడా అవుతుంది. అలాంటి అనుభవం లేని వాడెవడో పుస్తకం చదివి ఏదేదో ఊహించుకోకండి. మీకు ఇంకా పిల్లలు లేనట్టున్నారు. అందుకే ఈ పుస్తకం గొప్పగా ఉందనుకొంటున్నారు. పోను పోను తెలుస్తుంది లెండి" అని సీరియస్‌గా చెప్పి, రైలు దిగిపోయాడు.

నాకు కొద్దిగా కోపం వచ్చింది. ఆయనకు ఆ పుస్తకంలో రాసిన విషయాలు నచ్చకపోవచ్చు. అంతమాత్రం చేత ఆ రచయితను నాకూ నీకూ అనడం ఏం సబబు? అసలు ఆ పెద్ద మనిషి పుస్తకాన్ని చదివాడో లేదో అనుకొని మౌనంగా ఉండి పోయాను ఆయన వెళ్లిన వైపే గుడ్లప్పగించి చూస్తూ.

ఆయన భార్య పిల్లలతో బాటు కిందికి దిగి, ప్లాట్‌ఫాం మీద నేను కూర్చున్న కిటికీ దగ్గరగా వచ్చింది. ఆవిడ దగ్గర ఏం మాటలు పడాలో అని అదిరిపోయాను.

"ఏమీ అనుకోకండి ఆయన అలా మాట్లాడినందుకు. ఆ పుస్తకం ఆయన రాసిందే! కావాలంటే వెనుక అట్టపైన ఆయన ఫోటో ఉంది చూడండి. కాకుంటే పెళ్లికాక మునుపు రాసిన పుస్తకం అది. అందుకే ఆ కోపం. తెలిసీ తెలియక రాసిన తన మీదే ఆ కోపమంతా! మీ మీద కాదు" అని చెప్పి చిరునవ్వుతో సెలవు తీసుకుంది.

నేను ఆశ్చర్యంగా మా వారి వైపు చూశాను.

-కె.ఎస్.ఇందిరా ప్రియదర్శిని
(చెన్నయ్)